కథ



# తప్పేంవిటి?

– పి.ఎస్.నారాయణ

సుశీల ఆఫీసులో కాలు పెడుతుండగానే అందరూ కళ్ళెత్తి ఆమె వంక ఒక్కసారి చూశారు.

సుశీల మేనేజర్ టేబుల్ దగ్గర ఆగి అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం పెట్టి తన సీటు దగ్గరకు వచ్చింది. వ్యానిటీని కుర్చీ హ్యాండిల్‌కు తగిలించి, బాత్‌రూంలోకి వెళ్ళి అద్దంలో చూచుకుంటూ చెంపలు సరిదిద్దుకున్నది. నుదుట, మెడమీద చెమట పట్టినట్లనిపించగా రుమాలుతో అద్దుకొని, పమిట మడతలు సరిచేసుకొని వచ్చి సీట్లో కూర్చున్నది.

పక్క సీటు రాధ సుశీల వైపుకు వంగి, "నువ్వంటే ఇక్కడ అందరికీ చాలా ఈర్ష్యగా వున్నది!" అన్నది చిన్నగా రహస్యం చెబుతున్నట్లుగా.

"దేనికి?" అన్నది మెడతిప్పి ఆమె వంకే చూస్తూ.

"నువ్వు ఠంచన్‌గా తొమ్మిదిన్నరకు సీట్లో కూర్చుంటావ్...మాకు అలా కుదరదు కదా... మేమూ పదినిముషాల ముందన్నా వస్తాం... పావుగంట ఆలస్యంగానయినా వస్తాం..మాది ఆర్టీసీ దైవాధీనం సర్వీసు... ఆలస్యంగా వచ్చిన రోజున ముసలి మేనేజర్ గుంటనక్క చూపులకు వళ్ళు కంపరమెత్తిపోతుంది!...ఇంతకీ మీ ఆయన ఏం చేస్తుంటాడేం...ఎప్పుడడిగినా దాటేస్తుంటావ్!" అన్నది. ఆయన ఏం చేయడని అక్కడ అందరికీ తెలుసు.

ఎదురుగ్గా కూర్చుండే కస్తూరి, జలజ కూడా వచ్చారు, రాధ మాటలు వింటూనే.

"అందరి ఆయనలూ ఏం చేస్తుంటారో మా ఆయనా అదే చేస్తాడు!" అన్నది కొంటెగా సుశీల.

"ఏం ఉద్యోగమని మేం అడిగేది?" జలజ అడిగింది మొఖం ఎర్రబడగా.

"అదే నేనూ చెబుతున్నది... నా పనులూ, మా అబ్బాయి పనులూ ఆయనే చూస్తుంటారు... అది ఉద్యోగం కాదా!" అంటూ పకపకా నవ్వింది సుశీల.

"నీ మొగుడులాంటి వాడే మాకూ దొరికితే ఎంత బాగుండేదో!... మేమూ ఠంచనుగా తొమ్మిదిన్నరకల్లా సీట్లో కూర్చుండేవాళ్ళం!" అన్నది కళ్ళు తిప్పుతూ కస్తూరి.

"మీరు రెండు జీతాలు కావాలనుకున్నారు మరి...మీ సంతోషాలు మీవి!"

"ఆయనకు కోపం రాదా నువ్వలా సతాయిస్తుంటే- అది చేయి ఇది చేయి అని!" అన్నది జలజ కళ్ళెగరేస్తూ.

"మనం ఆడవాళ్ళం... మనకు తప్పదు!"

"ఏం...మగవాళ్ళు పుట్టినట్లే మనమూ పుట్టాం!"

"ఏది ఏమైనా... మొగవాడు ఉద్యోగం చేయనంత మాత్రాన ఇంట్లో వంట చేయటం, పిల్లవాడి పనులన్నీ చూడటం, పొద్దున్నే నిన్ను ఆఫీసులో దించటం, సాయంత్రం అయిదింటికల్లా వచ్చి ఇంటికి తీసుకువెళ్ళటం...చూసేవాళ్ళకు బాగుంటుందా. అవునూ, రాత్రిపూటయినా వంట నువ్వు చేస్తావా...లేకపోతే ఆ డ్యూటీ కూడా ఆయనదేనా?" అన్నది కస్తూరి కొంటెగా, మాటల్లో ఎగతాళి మిళితం చేసి.

"ఎవరికి వీలుంటే వాళ్ళం చేస్తాం...సరదా పడితే ఇద్దరం కలిసి చేస్తాం!"

అన్నది మరింత కొంటెగా సుశీల.

"నాకంటే ఆయనే బాగాచేస్తారు...రేపు బిర్యానీ చేయించి తెచ్చేదా...లంచ్‌లో నలుగురం తిందాం!"

దీని కసలు సిగ్గూ, బిడియం లేవా అనిపించింది ఆ ముగ్గురికీ...

"ఆయనకు ఎక్కడా ఉద్యోగం దొరకలేదేమిటి?" అన్నది రెచ్చగొడుతున్నట్లుగా జలజ. "దొరికినా ఆయనకు ఈ పనే నచ్చి ఇంట్లో ఉండిపోయారా?"

వాళ్ళ ఎగతాళి అర్థమయినా సుశీల నిగ్రహించుకున్నది.

"మా పెళ్ళినాటికి ఆయన ఉద్యోగంలోనే వున్నారు. కాకపోతే ఆ బోడి జీతం కోసం పొద్దున్నే ఎక్కడో ఊరిబయట వున్న ఫ్యాక్టరీకి వెళ్ళాలి. అందుకని నేనే మానేయమన్నాను! రెండు తిండ్లకు ఇద్దరమూ ఒళ్ళు విరుచుకోవటం దేనికి. ఆయనకు దగ్గరలో ఏదైనా మంచి ఉద్యోగం వస్తే, నేను మానేసి వంట పనులూ, ఇంటి పనులూ చూసేదాన్ని, పిల్లవాడి బాగోగులు చూసేదాన్ని. అంతదాకా ఎందుకు, మా పిల్లవాడు ఎప్పుడూ క్లాసులో ఫస్టే తెలుసా...కారణం ఏమిటంటావ్...ఇంట్లో గైడెన్సే!...నా ఉద్దేశంలో మనం పిల్లల్ని కని పడేయటమే కాదు వాళ్ళకు మంచి భవిష్యత్తును కూడా ఇవ్వాలి!"

ఆ మాటకు మొఖాలు ముడుచుకున్నారు ముగ్గురూ. వాళ్ళ పిల్లల్లో ఒకళ్ళు హాస్టల్లోనూ, మరొకళ్ళు అమ్మమ్మ దగ్గరా వున్నారు.

"పొద్దస్తమానం ఇంట్లో కూర్చుంటే ఏం తోస్తుందే ఆయనకు పాపం!" అన్నది దీర్ఘం తీస్తూ కస్తూరి.

"ఆయనకు క్షణం తీరికుండదు. మీలాగా మాకు రెండు జీతాలు లేవన్నానుకదా పిల్లవాడిని స్కూల్లో దించి రాగానే వాషింగ్ మెషీన్ వేస్తారు. టిఫిన్లకు పిండ్లు గ్రైండర్‌లో వేసేస్తారు. ఇల్లు సర్దేస్తారు!"అన్నది అది చాలా మామూలు విషయం అన్నట్లుగా సుశీల.

"పని మనిషయినా ఉన్నదా?" అన్నది టీజింగ్‌గా జలజ. "లేకపోతే అందులోనూ ఆదానేనా?"

"ఉన్నా ఏ పనిమనిషి నాగా పెట్టకుండా వస్తున్నదిలే. అది రాని రోజున మా ఇద్దరికీ ముఖ్యంగా ఆయనకు అసలు చేయి తీరికే వుండదు!"

"పోనీ మధ్యాహ్నాం ఖాళీ సమయంలోనైనా బోరు కొట్టదే, పాపం!"

"పిల్లవాడిని స్కూలునుంచి తెచ్చిం తరువాత, నన్ను తీసుకు వెళ్ళేటందుకు ఆఫీసుకు వచ్చేటంతవరకూ పదిమంది పిల్లలకు మాథ్స్ చెబుతారు...అందులో ఆయన ఎక్స్‌పర్టేలే!"

"అయితే కాస్తో కూస్తో సంపాదన ఉన్నదంటావ్. మరీ బీద పలుకులు పలుకుతావేం. ఒక్క జీతం ఒక్క జీతం అంటూ!"

"ఆ డబ్బులు ఇంట్లో ఖర్చుపెట్టటానికి కాదు..ఈసారి అమ్మాయి పుడితే దాని పెళ్ళికోసం దాచిపెడతాం... నువ్వన్నట్లు ఆయనకు బోరుకొట్టి ఉద్యోగం చేయాలనిపిస్తే దాన్దేముంది నేనిక్కడ మానేస్తాను!"

"అప్పుడు నీకా ఇబ్బందులన్నీ తప్పవన్నమాట!" అన్నది కించత్ మనస్సులో సంతోషపడుతూ.

"ఇబ్బందేమున్నది ఇప్పుడాయన చేస్తున్నవన్నీ నేను చేస్తాను. భార్యాభర్తల్లో ఎవరు ఏం చేస్తే మాత్రమేమిటి?"

"ఆయన నిన్ను ఆఫీసులో దించినట్లుగా నువ్వూ ఆయన్ను రోజూ దించుతావేమిటి-ఖర్మ!"

"దించుతాను!...ఏం...నామర్దా దేనికి? మనం బయటవాళ్ళకు చేస్తున్నామా...!" అన్నది చిరునవ్వుతో.

"పిల్లవాడిని స్కూల్లో దించటానికి, మళ్ళీ తీసుకురావటానికీ నాకు స్కూటరు అక్కర్లేదా... ఇంట్లోకి కావాల్సినవి తెచ్చుకోవాలంటే నేను బజారుకి వెళ్ళాలి. అలాంటి పన్లకు రెండో స్కూటరెక్కడ కొంటాం. పొద్దున్నే దించి స్కూటరు తెచ్చుకుంటే, సాయంత్రం వెళ్ళి తీసుకొని రావచ్చు...అందులో తప్పేమిటి?" అన్నది వాళ్ళ నోళ్ళకు తాళాలు వేస్తూ.

❑